కాంగ్రెస్‌లో కలవరం

- హస్తం పార్టీలో రచ్చకెక్కుతున్న వర్గ విభేదాలు
- నేతలతో పాటు కార్యకర్తల్లోనూ..
- కొత్త, పాత నేతల మధ్య కుదరని సమన్వయం
- రెండు నియోజకవర్గాల మధ్యలోనే వర్గపోరు
- ఇటీవల బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం, ఏనుగు వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు
- కామారెడ్డిలో ఇప్పటికే రెండు వర్గాలుగా చీలిక
- తాజాగా సీఎం సోదరుడు కొండల్ రెడ్డి కటౌట్లతో చర్చనీయాంశం

కామారెడ్డి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికార పార్టీ కాంగ్రెస్‌లో వర్గపోరు ఎక్కువవుతోంది. ఏ నియోజకవర్గంలో చూసినా గ్రూప్ విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. పార్టీ, నామినేటెడ్ పదవుల విషయంలో చాలాచోట్ల నేతల్లో అసంతృప్తి బయటపడుతోంది. తమకు అవకాశం రాకపోవడానికి పార్టీలోని ప్రత్యర్థులే కారణమంటూ విమర్శలు చేసుకుంటున్నారు. నియోజకవర్గాల్లో ముఖ్యనేతల మధ్య ఆధిపత్య పోరు కన్పిస్తోంది. రెండు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే కార్యక్రమాలు చేస్తున్నారు. ఇక మంత్రులు, పీసీసీ నేతల పర్యటన సమయంలో తమ ఆధిపత్యం కనబరుచుకునేందుకు నేతల మధ్యనే కాకుండా కార్యకర్తల్లోనూ విభేదాలు తలెత్తుతున్నాయి. చివరకు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రధానంగా కామారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గంలో ముఖ్యనేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. దీంతో ఆయా నియోజకవర్గాల్లోని క్షేత్ర స్థాయి కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. అధిష్ఠానం దృష్టిసారించి నేతల మధ్య సమన్వయం తీసుకురావాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.

కామారెడ్డిలో రెండు వర్గాలుగా..

ఒకప్పుడు కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ అంటే షబ్బీర్అలీకి అడ్డా. అలాంటిది ప్రస్తుతం కామారెడ్డి కాంగ్రెస్‌లో కుంపటి నెలకొంటుంది. నియోజకవర్గంలో కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే అనే యమునతీరుగా ముఖ్యనేతలు వ్యవహరిస్తున్నారు. ఇటీవల నియోజకవర్గంలో షబ్బీర్‌అలీ వర్గీయులు వర్సెస్ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి వర్గం మధ్య విభేదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. గత కొన్నిరోజులుగా షబ్బీర్‌అలీ చంద్రశేఖర్‌రెడ్డికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఆయన ప్రత్యేక కుంపటి ఏర్పాటుచేసుకున్నాడనే చర్చసాగుతోంది. ఇటీవల జిలిటెన్ స్టిక్స్ పేలుడు పదార్థాల కేసులో చంద్రశేఖర్‌రెడ్డిని జైలుకు పంపడంలో షబ్బీర్‌అలీ వర్గీయులే కుట్రచేశారంటూ చంద్రశేఖర్ రెడ్డి వర్గీయులు ఆరోపిస్తున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి జైలుకు వెళ్లి తిరిగి వచ్చాక పరోక్షంగా షబ్బీర్‌అలీ, ఆయన అనుచరులు కలిసి తనపై అక్రమ కేసు నమోదుచేయించారని పరోక్షంగా ఆరోపణలు చేయడం నియోజకవర్గంలో మరింత చర్చనీయాంశంగా మారింది. అప్పటినుంచి ఈ రెండు వర్గాల మధ్య నియోజకవర్గంలో ఆధిపత్యపోరు మరింత పెరిగిందని పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన చంద్రశేఖర్‌రెడ్డికి షబ్బీర్‌అలీ అండగా ఉంటూ ఆయన సతీమణి ఇందుప్రియను చేసినప్పటికీ ఒటెందుపోకడతో కుటమి ఏర్పాటు చేసుకున్నాడని షబ్బీర్‌అలీ అనుచరులు ఆరోపిస్తున్నారు.

కొండల్‌రెడ్డి కటౌట్లతో మరోవర్గం

కామారెడ్డి నియోజకవర్గ కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి కటౌట్లు రాత్రికి రాత్రే వెలవడంతో కాంగ్రెస్‌లో చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ సీనియర్ నేత ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఫోటోలేకుండానే కటౌట్లు వెలువడడంతో పార్టీ వర్గాలు ఆశ్చర్యానికి గురయ్యారు. మరోవర్గమే ఈ కటౌట్లను ఏర్పాటు చేసినట్లు పార్టీలో చర్చసాగుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి పోటీ చేసిన విషయం తెలిసిందే. సీఎం తరఫున ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి అన్నీతానై ప్రచార వ్యవహారాలు చూశాడు. అదే సమయంలో షబ్బీర్‌అలీ కామారెడ్డి సీటును త్యాగం చేసి నిజామాబాద్ అర్బన్‌లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఎన్నికల తర్వాత కొండల్‌రెడ్డి నియోజకవర్గానికి రాలేదు. షబ్బీర్ అలీ కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాలను చూస్తు కార్యకర్తలను, నేతలను సమన్వయం చేస్తూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో షబ్బీర్‌అలీ ఫొటో లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి కటౌట్లు ఎవరు ఏర్పాటుచేశారనే దానిపై పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. నియోజకవర్గంపై కొండల్‌రెడ్డి దృష్టిపెట్టారా లేక మరో వర్గం కావాలనే కటౌట్లు ఏర్పాటు చేశారా అనేదానిపై షబ్బీర్‌అలీ వర్గీయులు ఆరాతీస్తున్నారు.

బాన్సువాడలో పోచారం వర్సెస్ ఏనుగు

బాన్సువాడ నియోజకవర్గంనుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులు రగిలిపోతున్నారు. ఎమ్మెల్యే పోచారం కాంగ్రెస్‌లోకి వచ్చినప్పటి నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డితో పాటు ఆయన వర్గీయులకు ప్రాధాన్యత తగ్గుతూ వస్తోంది. దీంతో బాన్సువాడలో పోచారం వర్సెస్ ఏనుగుల మధ్య వర్గపోరు కొనసాగుతూనే ఉంది. నియోజకవర్గంలో మొదటి నుంచి కాంగ్రెస్ అంటిపెట్టుకుని ఉన్న కాసుల బాలరాజ్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కలేదు.ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి (మిగతా 8లో..)



కామారెడ్డి నియోజకవర్గకేంద్రంలో వెలిసిన కొండల్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి కటౌట్లు

గ్రంథాలయాల్లో మెరుగైన సౌకర్యాలు

» వంశీకృష్ణ, గ్రంథాలయ జిల్లా కార్యదర్శి,కామారెడ్డి



గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నామని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ఇంటర్వ్యూ విశేషలు..

ప్రశ్న: జిల్లాలో ఎన్ని గ్రంథాలయాలున్నాయి.. వాటి పరిధిలో ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు?

జవాబు: జిల్లాలో మొత్తం 20 గ్రంథాలయాలు ఉన్నాయి. ఇందులో జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు 19 శాఖ గ్రంథాలయాలు ఉన్నాయి. మొత్తం 9మంది గ్రంథపాలకులు ఉన్నారు. ఇందులో రెగ్యులర్ సిబ్బంది ఐదుగురు ఉండగా మిగిలిన నలుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

ప్ర : సిబ్బంది లేమిని ఏ విధంగా అధిగమిస్తున్నారు?

జ: ప్రస్తుతం ఉన్న సిబ్బందికి మిగిలిన శాఖ గ్రంథాలయాల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాం. వారితోపాటు ఆయాచోట్ల ఉన్న కింది స్థాయి సిబ్బంది సహకారంతో పాఠకులకు, నిరుద్యోగులకు గ్రంథాలయాల్లో మెరుగైన సౌకర్యాలు అందేలా చూస్తున్నాం.

ప్ర : శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలను గుర్తించారా.. ఎన్ని నూతన గ్రంథాలయ భవనాలను నిర్మించారు?

జ: జిల్లాలోని గాంధారి, బీర్కూర్, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, పిట్లం, బాన్సువాడ గ్రంథాలయాలు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించాం. గాంధారి, బాన్సువాడ గ్రంథాలయాలు ఇతర చోట్ల కొనసాగుతున్నాయి. బీబీపేట, దోమకొండ, మద్నూర్, లింగంపేట, జుక్కల్, బిచ్కుందలో కొత్త గ్రంథాలయ భవనాలను నిర్మించాం.

ప్ర : ఇప్పటివరకు ఎంతమంది గ్రంథాలయాల్లో చదువుకుని ఉద్యోగాలు సాధించారు?

జ: గ్రంథాలయంలో చదువుకుని 245 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇందులో గ్రూప్-4-23, జెఎల్, డీఎల్-24, ఎస్‌జీటీ-70, కానిస్టేబుల్‌లు-75, ఎస్సై-2, లైబ్రరియన్-3, పంచాయతీ సెక్రటరీలు-18, స్కూల్ అసిస్టెంట్‌లు-15, ఏఈఈ-2, రైల్వే-12, గ్రూప్-2-1 ఉద్యోగాలు సాధించారు.

ప్ర : గ్రంథాలయ పన్ను ఎంతమేర రావాల్సి ఉంది?

జ: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి రూ.కోటీ 50 లక్షలు గ్రంథాలయ పన్ను రావాల్సి ఉంది. ఇందులో 20లక్షలు మాత్రమే చెల్లించారు. మిగిలిన 1.30 లక్షలు రావాల్సి ఉంది. ఇక మున్సిపాలిటీల నుంచి 65లక్షల గ్రంథాలయ పన్ను రావాల్సి ఉండగా 25 లక్షలు మాత్రమే చెల్లించారు. ఇందులో కామారెడ్డి మున్సిపల్ 2లక్షలు, బాన్సువాడ మున్సిపల్ 10లక్షలు, ఎల్లారెడ్డి మున్సిపల్ 13 లక్షల పన్ను చెల్లించాల్సి ఉంది.

ప్ర : పన్ను వసూళ్ల చేయకపోతే పుస్తకాల కొనుగోలు ఎలా చేస్తారు?

జ: గ్రంథాలయ పన్నుకోసం ఇప్పటికే జిల్లా పంచాయతీశాఖ, మున్సిపల్‌శాఖ అధికారులకు వినతులిచ్చాం. ఆస్తిపన్నులో వారు వసూలు చేసిన గ్రంథాలయ పన్ను చెల్లిస్తే పాఠకులు, నిరుద్యోగులకు కావాల్సిన మరిన్ని పుస్తకాలను అందుబాటులోకి తెవడంతో పాటు ఆయాగ్రంథాయాల్లో సౌకర్యాల కల్పనకు నిధులు వినియోగిస్తాం.

• (కామారెడ్డి టౌన్, ఆంధ్రజ్యోతి)



హసన్‌పల్లిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం

ముర్రుపాలే బిడ్డకు శ్రేయస్కరం

మహమ్మద్‌నగర్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతమని, ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరీ అన్నారు. సోమవారం మహ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలే అందించాలని అన్నారు. తల్లి పౌష్టికాహారం తీసుకుంటేనే బిడ్డకు రోగనిరోధక శక్తి అందుతుందని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది సులోచన, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న దివ్యాంగులు

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

» దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు : కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డిటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ప్రతీ ఫిర్యాదును సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 142 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గాంధారి మండలంలో వేల ఎకరాలలో అటవీ భూమి ఆక్రమణకు గురవుతుందని తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ నేనావత్ మొజీరాం నాయక్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మరికొంత మంది తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. భిక్కనూరు మండలంలోని పునరావాస కేంద్రంలో దివ్యాంగులు తయారు చేసిన రాఖీలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టరేట్‌లో స్టాల్స్ ఏర్పాటుచేసేందుకు అనుమతించారు. మొదటి రాఖీని కలెక్టర్ కొనుగోలు చేయగా దివ్యాంగులు కలెక్టర్‌కు కట్టారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, డీఆర్‌డీఏ పీడీ సురేందర్, ఏపీడీ విజయలక్ష్మీ, డీపీఎం హెచ్‌డీ శ్రీనివాస్, ఏపీఎం సాయిలు, సీసీహరిలాల్ పాల్గొన్నారు.

జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం రాజేందర్ బదిలీ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరాఫరాల శాఖ డిస్ట్రిక్ మేనేజర్‌గా పనిచేస్తున్న రాజేందర్ బదిలీ అయ్యారు. గత రెండేళ్లుగా రాజేందర్ డీఎంగా పనిచేస్తున్నారు. ఆయనను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్ ఉన్నతాధికారులు జీఎంగా బదిలీ చేశారు. రాజేందర్ నేడు రిలీవ్ కానున్నారు. ఆయన స్థానంలో కరీంనగర్‌లోని పౌరసరాఫరాలశాఖ అసిస్టెంట్ మేనేజర్‌గా ఉన్న శ్రీకాంత్ కామారెడ్డి ఇన్‌చార్జ్ డీఎంగా బదిలీపై రానున్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు దళారులను ఆశ్రయించొద్దు'

బాన్సువాడటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు దళారులను ఆశ్రయించొద్దని గృహ నిర్మాణశాఖాధికారులు తెలిపారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో సోమవారం 16 ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు వేశారు. లబ్ధిదారులు బిల్లుల డబ్బులు నేరుగా ఖాతాలో జమవుతాయని తెలిపారు. చెప్పారు. కార్యక్రమంలో కోటగల్లీ కాంగ్రెస్ నాయకులు లింగం, శ్రీకాంత్, మోతీలాల్, హన్మాండ్లు తదితరులున్నారు.



మంజీరా లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలిస్తున్న పోచారం

పంటలకు నీరు అందేలా చూడాలి

• లిఫ్ట్ ఇరిగేషన్ పరిశీలనలో అధికారులతో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మంజీర పరివాహక ప్రాంతం చింతల్‌నాగారం శివారులోని పంటలకు సాగు నీరు అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వవ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంజీరా చెక్‌డ్యాంలో నీరు ఉన్నా పంటపొలాలకు సాగునీరు రావడం లేదని రైతులు పోచారం దృష్టికి తీసుకవచ్చారు. కాగా సోమవారం ఆయన బాన్సువాడ మంజీరా లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌డ్యాంలో నీరు పుష్కలంగా ఉందని, పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా నిజాంసాగర్ ఆయకట్టులో పంట పొలాలు ఎండుతున్నాయని, రైతుల కోసం ప్రధాన కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేయాలని సీఈ శ్రీనివాస్‌కు సూచించారు. స్పందించిన సీఈ మంగళవారం ప్రధాన కాల్వల ద్వారా నిజాంసాగర్ నీటిని విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ ప్రజాప్రతినిధులు, రైతులు తదితరలు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న పోచారం

రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాలి

• భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు



మాట్లాడుతున్న రాజేశ్వర్ రావు

రామారెడ్డి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు అన్నారు. రామారెడ్డి మండలం రైతు వేదికలో సోమవారం ఆయన మాట్లాడారు. రైతులు పంటలు సాగుస్తూ ఒకరికొకరు సహకరించుకోవాలని అన్నారు. సాగులో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, జిల్లా కమిటీ మెంబర్ కొడగండ్ల రాజశేఖర్, సుద్దాల లింగం, మండల ఉపాధ్యక్షులు రాంరెడ్డి, గ్రామ అధ్యక్షులు, గ్రామ కార్యదర్శులు మండల కమిటీ మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

డుమ్మా మాస్టర్లకు చెక్

- ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నిషన్ అమలు
- జిల్లాలో బీజీనెస్ టీచర్లలో కలవరం
- సాంకేతిక సమస్యలతో ఆలస్యంగా రిజిస్ట్రేషన్
- జిల్లాలో 68 శాతం మాత్రమే పూర్తి

కామారెడ్డిటౌన్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): విధులకు హాజరుకాకుండా డుమ్మాకొడుతున్న టీచర్లకు ఇకనుంచి చెక్‌పడనుంది. విద్యాశాఖకార్యాలయాల్లో ఉద్యోగులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) హాజరు విధానాన్ని ప్రభుత్వం అమలుచేస్తోంది. ఇందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది నేరుగా తమ సెల్‌ఫోన్లలోనే ఆన్‌లైన్ విధానంలో హాజరు నమోదుచేసుకునేలా టీజీఎఫ్ఆర్ఎస్ పేరుతో ప్రత్యేక యాప్ రూపొందించారు. ఈ నూతన విధానాన్ని గత శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు 68శాతం మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తిఅయింది.పలుచోట్ల సాంకేతిక సమస్యలలో ఆలస్యంగా రిజిస్ట్రేషన్ అవుతున్నట్లు పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అయితే జిల్లాలో బీజీనెస్ టీచర్లలో ఆ యాప్ వచ్చినప్పటి నుంచి కలవరం నెలకొంది. పాఠశాలకు అడపదడప వస్తూ తమ వ్యాపాకాల్లో మునిగిపోయిన పలువురు ఉపాధ్యాయులు ఇప్పుడు ఏ విధంగా తమ బీజీనెస్‌లను చేసుకోవాలో అర్థంకాక అవస్థలు పడుతున్నారనే చర్చ సాగుతోంది. అయితే గతేడాదినుంచి పాఠశాలల్లో ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ఉపయోగించి విద్యార్థుల హాజరుశాతాన్ని నమోదు చేస్తున్నారు. అదే తరహాలో టీచర్లకు హాజరు నమోదు చేస్తున్నారు.

యాప్‌లో రిజిస్ట్రేషన్ ఇలా..

జిల్లాలోని అన్ని జిల్లా, మండల ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో ఈ విధానం అమలు చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది దాదాపు 4500 వరకు ఉన్నారు. కొత్త విధానం అమలులో భాగంగా సంబంధిత ఉద్యోగి స్మార్ట్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తారు. మొదటగా ఉద్యోగి వివరాలతో రిజిస్టర్ చేసుకుని లాగిన్ కావాలి. యాప్ ఇన్‌స్టాలేషన్ సమయంలోనే సంబంధిత కార్యాలయం, పా ఠశాల ఆవరణ లాంగిట్యూడ్, లాటిట్యూడ్‌ను టెక్నిషియన్ అప్‌లోడ్ చేస్తారు. ఒక్కసారి లాగిన్ అయిన తర్వాత యాప్ నిరంతరం వినియోగించవచ్చు. ఇక ఉద్యోగి ఉదయం నిర్దేశిత సమయానికి పాఠశాలకు వచ్చిన తర్వాత యాప్‌ను ఓపెన్ చేసి క్లాక్ ఇన్ అనే ఆప్షన్ నొక్కితే సదరు ఉద్యోగి వచ్చిన సమయం ఆన్‌లైన్‌లో సంబంధిత పర్యవేక్షణ అధికారికి చేరుతోంది. పాఠశాలలో పనిసమయం, ముగిసిన తర్వాత క్లాక్‌ఔట్ అనే ఆప్షన్‌పై టచ్‌చేస్తే ఉద్యోగి కార్యాలయాన్ని విడిచి వెళ్లే సమయాన్ని, పని చేసిన గంటలను లెక్కించి తిరిగి సంబంధిత పర్యవేక్షణ అధికారి ఆన్‌లైన్‌లో చేరుతుంది.



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

బిజినెస్ టీచర్లలో కలవరం

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్న ఫిర్యాదులు అనేకం ఉన్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోంది. చాలామంది పని చేస్తున్న చోట నివాసం ఉండకుండా దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తు స్కూళ్లకు వేళకు చేరుకోవడం లేదు. మరికొందరైతే రియల్ఎస్టేట్, (మిగతా 8లో..)

'గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి'



సుంకెట్‌లో భూమిపూజ చేస్తున్న నాయకులు

మోర్తాడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపునర్సయ్య, పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు అన్నారు. సోమవారం మండలంలోని సుంకెట్‌లో పలు అభివృద్ధి పనులకు వారు భూమిపూజ చేశారు. గ్రామంలోని మున్నూరుకాపు సంఘం వద్ద రూ.5లక్షల నిధులతో కిచెన్‌షెడ్డు నిర్మాణానికి, ప్రభుత్వ పాఠశాలలో రూ.4 లక్షల 80 వేలతో బాలికలు, బాలుర కోసం టాయిలెట్ల నిర్మాణానికి, గురడిరెడ్డి సంఘానికి రూ.5 లక్షలతో ప్రహరి నిర్మాణానికి నాయకులు భూమిపూజ చేశారు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఈ నిధులను మంజూరు చేయించారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, కాంగ్రెస్ నాయకులు ఆనంద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహిపాల్, నాయకులు తీగెల నర్సారెడ్డి, ఎంసీ గంగాధర్, సంతోష్, రాజేష్, గంగనర్సయ్య, ప్రణయ్, వినోద్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నోరు జారితే ప్రజలే బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న మారచంద్రమోహన్, సాయిబాబా గౌడ్‌లు

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనాయకులపై మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మరోసారి నోరుజారితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్‌లు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జనహిత పాదయాత్రకు లభించిన అశేష ప్రజాదారణను చూసి జీర్ణించుకోలేని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నాడని ఆయన వక్రబుద్ధికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను వారి కష్టనష్టాలను తీర్చడానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లు జనహిత పాదయాత్రను చేపట్టారని విచ్చేని అశేష జనానికి లబ్ధిదారులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఇట్టెం జీవన్, మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు రేగుల సత్యనారాయణ, పండిత్ పవన్, లిక్కి శంకర్, ఫయాజ్, భూపేందర్, నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఇసుక వాహనం పట్టివేత



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఇసుక వాహనం

కోటగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలం మంజీర నది సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టాటాఏస్ వాహనాన్ని పట్టుకున్నట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు వాహనాన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోగొట్టుకున్న 10 సెల్‌ఫోన్‌ల అప్పగింత



ఫోన్‌లను అప్పగిస్తున్న సీఐ

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బోధన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలు పోగొట్టుకున్న 10 మొబైల్ ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి వాటి యజమానులకు సోమవారం అప్పగించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ ఫోన్‌లను ప్రజలు జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు.

అడవి పందిని ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన సంఘం ప్రవీణ్

ఆలూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం మచ్చర్ల గ్రామ శివారులో అడవి పంది అడ్డురావడంతో అడవి పందిని ఢీకొని బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామానికి చెందిన సంఘం ప్రవీణ్ తలకు తీవ్ర గాయాలతో నిజామాబాద్ ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గా ఆర్మూర్ సీఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు : ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రులు

వేల్పూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని లక్కోర గ్రామసమీపంలో 63వ జాతీయ రహదారిపై కారు ఆటోను ఢీకొంది దీంతో ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై సంజీవ్ తెలిపారు. అంక్సాపూర్ నుంచి ఆటో డ్రైవర్, ప్యాసింజర్ ఆర్మూర్ వైపునకు వస్తుండగా లక్కోర సమీపంలో ఎదురుగా ఆర్మూర్ నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొంది. ఆర్మూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ లింబాద్రి, ప్యాసింజర్ ముత్తెన్నలకు తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ జలందర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ ఆటోను ఢీకొట్టినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పడిగెలలో కరెంట్ సమస్యను పరిష్కరించండి

● బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



సమస్యను ట్రాన్స్‌కో ఎస్ఈకి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న కరెంట్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈకి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. శుక్రవారం పడిగెల గ్రామానికి చెందిన రైతులు గ్రామంలో కరెంట్ సరఫరా సమస్యను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ట్రాన్స్‌కో ఎస్ఈ తో ఫోన్‌లో మాట్లాడారు. కరెంట్ సమస్య వల్ల సాగవుతున్న మొక్కజొన్న పంట ఎండిపోయే పరిస్థితి ఉందని, రైతులకు ఇబ్బంది కాకుండా చూడాలని ఎస్ఈ కి వివరించారు. గ్రామంలో గత మూడు రోజుల క్రితం పూర్తిగా కరెంట్ లేదని, రెండు రోజులుగా ఒక వైపు 6 గంటలు, మరో వైపు 6 గంటల చొప్పున కరెంట్ సరఫరా చేస్తున్నారని చెప్పారు. దీనివల్ల పంటలకు నీరు సరిగా అందక మొక్కజొన్న పంట ఎండిపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. కరెంట్ సరఫరా విషయమై స్థానిక గ్రామ రైతులు సబ్‌స్టేషన్‌కు వెళ్లి అధికారులకు వివరించడం జరిగిందన్నారు. లోవోల్టేజీ సమస్య ఉందని, అందుకు మూడు కెపాసిటర్ సేల్స్, నాలుగు బ్యాటరీలు ఉంటేనే సమస్య పరిష్కారం అవుతుందని రైతులకు అధికారులు చెప్పినట్లు వివరించారు. వెంటనే సమస్య త్వరితగతిన పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్ఈని ఎమ్మెల్యే ఆదేశించారు.

అంతర్ పాఠశాలల మండల క్రీడా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

ఆర్మూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంఆర్‌సీలో సోమవారం అంతర్ పాఠశాలల మండలక్రీడల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాజగంగారాం మాట్లాడుతూ ఈ సంవత్సరం మండల క్రీడల నిర్వహణ కోసం వివిధ పాఠశాలల్లో తమ విద్యార్థులను సంసిద్ధులు చేయాలన్నారు. క్రీడల నిర్వహణకు ముందుకు రావాలని ప్రభుత్వ, ప్రైవేట్ పీడీలు, పీఈటీలకు సూచించారు. కార్యక్రమంలో పీడీలు మల్లేష్‌గౌడ్, గోపిరెడ్డి, మధు, గంగారెడ్డి, గంగాధర్, నిఖిత, రాజేశ్వర్, కిరణ్, జ్ఞానేశ్వర్, బ్రిజేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పథకాలు అందేలా కృషి చేయాలి

● ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్‌బీన్ హుందాన్

మాక్లూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఒక లబ్ధిదారుడికి అందేలా కృషి చేయాలని ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్‌బీన్ హుందాన్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని మాక్లూర్ కార్యాలయాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు ప్రతీ లబ్ధిదారుడికి అందుతున్నాయా అని ఆరా తీశారు. అంతేకాకుండా రేషన్‌కార్డులు, పెన్షన్‌లు ఎంతమందికి ఇస్తున్నారు, ఇటీవల కొత్తవారి వివరాలను అడిగి తెలుసుకుని అందరికీ అందజేయాలని కోరారు. అనంతరం వారికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, కో-ఆపరేటీవ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ వెంకటేశ్వర్, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో బ్రహ్మానందం, తదితరులున్నారు.



సన్మానం చేస్తున్న దృశ్యం

బీసీలకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యం

● పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్



మోర్తాడ్ ప్రజానిలయంలో మాట్లాడుతున్న టీపీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్

మెర్తాడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని అందుకే ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తుందని పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజానిలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీ వ్యతిరేక పార్టీలని ఆయన అన్నారు. బీసీల కోసం ఎన్నడూ మాట్లాడని నాయకులు గర్జనల పేరుతో బీసీలకు దగ్గర కావాలని చూస్తున్నారని, ఇలాంటి పార్టీలను బీసీలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కేసీఆర్ ఈ నెల 8న తమిళనాడులో బీసీ గర్జన పెడుతున్నారని కాగా బీసీలు వారిని నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రానున్న సంస్థాగత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ మళ్లీ జిమ్మిక్కులు చేస్తున్నారని ఆరోపించారు. బీసీలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అండగా నిలవాలని వేణుగోపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పాదయాత్రలు చేస్తుంటే బెంబేలు పడుతున్న బీఆర్ఎస్ నాయకులు పాదయాత్ర ఎందుకని ప్రశ్నిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాదయాత్ర ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ నెల 6న చేపట్టిన 42 శాతం రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ఆమోదించాలని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని బీసీ విద్యావంతులు, మేధావులు, ఉద్యమ కారులు భాగస్వాములు కావాలని వేణుగోపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల అధ్యక్షులు సోమదేవారెడ్డి, ముత్యాల రాములు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, ఏఎంసీ డైరెక్టర్లు మహిపాల్, నవీద్, ఆనంద్, రంజిత్, మహమ్మద్ షాదీక్, అర్గుల రమేష్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డీజేసౌండ్ వాడొద్దు



యువకులకు సూచనలు ఇస్తున్న ఎస్సై

మాక్లూర్ , ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మండపాల వద్ద నిబందనలకు విరుద్ధంగా డీజే సౌండ్‌ను ఉపయోగించవద్దని అలా చేసినచో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీజే ఆపరేటర్లకు, యజమానులకు ఎస్సై రాజశేఖర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గణేష్ మండపాల వద్ద శాంతియుతంగా పూజలు నిర్వహించుకోవాలని, ప్రజలకు ఇబ్బందికరంగా ఉండకుండా డీజే సౌండ్‌లను ఉపయోగించవద్దని ఆయన కోరారు.

కోటగిరి: గ్రామాలలో అనుమతి లేకుండా శబ్ద కాలుష్యం(డీజే సౌండ్)చేస్తే చర్యలు తప్పవని కోటగిరి ఎస్ఐ సునీల్ హెచ్చరించారు. కోటగిరి పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీజే ఆపరేటర్లు, యాజమానులతో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుమతి లేకుండా డీజే సౌండ్ చేస్తే డీజే బాక్స్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

నందిపేట : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీజే నిర్వహకులకు ఎస్సై శ్యాంరాజ్ కౌన్సిలింగ్ ఇచ్చారు. వినాయక చవితికి ఎటువంటి డీజేలు పెట్టరాదని ఒక వేళ నిబందనలను ఉల్లంఘిస్తే డీజేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. అంతేకాకుండా డీజే నిర్వహకులకు , ఆపరేటర్లకు నోటీసులు జారీ చేశారు. గణేష్ ఉత్సవాలను దిగ్విజయంగా జరుపుకొనుటకు ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలని ఎస్సై శ్యామ్ రాజ్ కోరారు.

మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన నాయకులు

నవీపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నవీపేట మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బీన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డిలు సందర్శించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశం మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వారు వాకబు చేసినట్లు తెలిసింది. పలువురు ప్రభు త్వ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదన్న విషయాన్ని నాయకుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, పలు శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలను వినియోగించుకోవాలి

భీమ్‌గల్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐకేపీ సీసీ గడాల రఘుపతి అన్నారు. సోమవారం మండలంలోని చేంగల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను చెల్లించాలని, పీఎం సురక్ష బీమా యోజన , పీఎం జీవన జ్యోతి పథకాలను వినియోగించుకోవాలన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ శృతిని మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో వీవో అధ్యక్షురాలు స్రవంతి, శరీష, లక్ష్మీ పాల్గొన్నారు.

వేధిస్తే షీటీంనకు సమాచారం ఇవ్వండి

భీమ్‌గల్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, యావ్‌టీజింగ్ చేసినా, వేధింపులకు గురైనా వెంటనే షీటీంకు సమాచారం ఇవ్వాలని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని షీ టీం పోలీస్‌లు విఘ్నేష్, సుమతి తెలిపారు. సోమవారం భీమ్‌గల్ మండలంలోని చేంగల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలు, నేరాలపై అవగాహన కల్పించారు. మహిళలు వేధింపులకు గురైతే డయాల్ 100 లేదా 8712659795 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

ముప్కాల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పీఆర్‌టీయూ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొత్తపల్లి శ్రీనివాస్, కొండ్రు నవీన్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ సంఘం కృషి వలనే పదోన్నతులు జరుగుతున్నాయని, పెండింగ్ బిల్లులు ఒక్కొక్కటి క్లీయర్ అవుతున్నాయన్నారు. సెప్టెంబర్ 1న హైదారబాద్‌లో పెన్షన్ విద్రోహదినం సందర్భంగా ధర్నా చేపట్టాలని ప్రతీసభ్యుడు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, కాంప్లెక్స్ హెచ్ఎంలు మెగిలి గంగారాం, గుండోజి నరేందర్, సామ ప్రసాద్, లక్ష్మణ్, పీఆర్‌టీయు నాయకులు రామకృష్ణ, మండల అధ్యక్షుడు రవికుమార్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ముందుకు రావాలి

● ఐకేపీ ఏపీడీ, డీపీఎం



ఫౌల్ట్రీ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఐకేపీ ఏపీడీ

కమ్మర్‌పల్లి, ఆగస్టు 4: (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఫౌల్ట్రీ యూనిట్‌ల నిర్వహణ నిమిత్తం మహిళా సంఘాలకు రుణసదుపాయాలు కల్పిస్తుందని ఆసక్తిగల మహిళా సంఘాల సభ్యులు ముందుకు రావాలని ఐకేపీ ఏపీడీ మధుసూదన్, డీపీఎం రాచయ్యలు కోరారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రం శివారులో మహిళా సంఘం సభ్యురాలి ద్వారా నిర్వహిస్తున్న ఫౌల్ట్రీని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 250 యూనిట్లకు గాను ఒక్కోయూనిట్‌కు 2 వేల చొప్పున 5లక్షల రుణ సదుపాయం కల్పిస్తుందని ఆసక్తిగల మహిళా సంఘాల సభ్యులు ముందుకు వచ్చి యూనిట్లు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కిరణ్‌కుమార్, సీసీలు రవికుమార్, అలే ఖ్య వివోలు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధితో వ్యవసాయ కూలీ మృతి

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో మహారాష్టకు చెందిన సంతోష్ రాంరావు కాంబ్లే (35) అనే వ్యవసాయ కూలీ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. గోవింద్‌పేట్ గ్రామానికి చెందిన యాల్లా రాజ్‌కుమార్ వద్ద వ్యవసాయ పనులను చూసుకోవడానికి మృతుడు జీతం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం వ్యవసాయ పనుల కోసం వెళ్లి నీరు పారిస్తుండగా మూర్ఛవ్యాధి రావడంతో బోర్లపడి చనిపోయినట్లు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించి అమలు చేయాలని కోరుతూ సోమవారం జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీకి తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి రైల్లో ఢిల్లీకి తరలివెళ్లారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 5,6,7వ తేదీల్లో జరిగే ధర్నాలో పాల్గొనేందుకు తరలివెళ్లామని కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు తెలిపారు. ఢిల్లీకి తరలివెళ్లిన వారి లో కాంగ్రెస్ జిల్లా యువనాయకులు నరేష్, కాంగ్రెస్ నిజామాబాద్ రూరల్ నాయకుడు సొప్పరి వినోద్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ అప్పాల పెద్ద రాజన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు అరుణ్, హన్మాండ్లు, రవి, రోహిత్, మహిపాల్, తదితరులున్నారు.

తల్లిపాల వారోత్సవాలు

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జర్నలిస్టు కాలనీలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ సోమవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు తల్లి పాల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. అనంతరం చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మీ, తల్లులు పాల్గొన్నారు.

మోర్తాడ్ : బాలింతలు తమ పిల్లలకు ముర్రిపాలు తాగించాలని, ముర్రిపాలు పిల్లలకు అమృతంతో సమానమని ఏసీడీపీ జ్ఞానేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ పాఠశాలలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సమావేశంలో తల్లులు, గర్భిణులు, బాలింతలకు ముర్రిపాల ప్రాముఖ్యతను వివరించారు. సరైనా సమయంలో అనుబంధ ఆహారం మొదలు పెట్టడం పిల్లలకు తల్లిపాలను రెండు సంవత్సరాల వరకు ఇవ్వాలని వారు వివరించారు. బిడ్డ బరువును, ఎత్తును ప్రతీనెల తీసి బిడ్డ పరిస్థితిని గమనించాలని తెలిపారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీటీచర్లు జ్యోతి, గీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో అన్నదానం

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ బోధన్ ప్రతినిధులు బసవేశ్వర్ రావు అన్నారు. సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ భవాని ఆధ్వర్యంలో లయన్స్ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. పేద ప్రజలకు నిత్యం సేవలందిస్తు లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ముందంజలో ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆర్‌సీ పావులూరి వెంకటేశ్వర్ రావు, నల్లూరి లక్ష్మీకాంత్, పావులూరి సుబ్బారావు, పావులూరి మనోజ్ఞ, తేజస్విని, సాయి కీర్తన తదితరులున్నారు.

శర్బత్‌కెనాల్ వద్ద అభివృద్ధి పనులు

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శర్బత్ కెనాల్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా ప్రయాణికులకు రూట్ మార్పు చేశామని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. ప్రజలు ఆచన్‌పల్లి బైపాస్, విజయమేరి వద్ద ఉన్న బైపాస్‌లను సద్వినియోగం చేసుకుని ఆ రూట్‌లలో ప్రయాణం చేయాలన్నారు. కేవలం టూ విల్లర్స్‌కు మాత్రమే అనుమతిస్తామన్నారు. బాన్సువాడ, వర్ని, రుద్రూర్ వెళ్లే బస్సులన్నీ బైపాస్ గుండానే వెళ్తాయన్నారు. ప్రయాణికులు అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకుని తమతమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలి



తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌలి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 4, 7వ వార్డులలో మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టి తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డు ఆఫీసర్లు, జవాన్లు, మెప్మా ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

పాలెంలో మధ్యాహ్నభోజనం పరిశీలన



తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోర్తాడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని, పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి సోమవారం సమ్మిరెడ్డి తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నభోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన వంటను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వంటలను వండిపెట్టాలని ఆదేశించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఏసీపీకి ఫిర్యాదు



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

రుద్రూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోటగిరి ఎస్ఐ సునీల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రుద్రూరు బీజేపీ మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రూరు మండల కేంద్రంలో ఆదివారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమం లో కోటగిరి మండల కేంద్రంలో గల ఓ హెయిర్ కటింగ్ సెలూన్ షాప్‌లో కటింగ్ చేయించుకుందామని వెళ్లగా అక్కడే కటింగ్ చేయించుకుంటున్న కోటగిరి ఎస్ఐ సునీల్‌కుమార్ దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగారని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడిని అని చెప్పినా వినకుం డా ఇబ్బందులకు గురిచేశారన్నారు. కానిస్టేబుళ్లను పిలిపించి షాప్‌ను మూసివేయాలని చెప్పి అవమానపర్చే విధంగా వ్యవహరించారని ఎస్ఐపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. కళాశాలలో మిగిలిపోయిన సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 11లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు డిగ్రీ కళాశాలలో సాహితీ ప్రారంభ కార్యక్రమం

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం, సప్తస్వర మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సాహితీ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సూర్యతేజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో, విశిష్ట అతిథిగా సౌత్ ఫిలిం డైరెక్టర్ సూర్యతేజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, పంప సాహితి పీఠం మహిళ అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి, జయశీల, మిట్టం ధనుంజయ్ హజరు కానున్నారని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

వర్సిటీలో ఎంఎడ్ సెమిస్టర్ పరీక్షల ఫీజు నోటిఫికేషన్ విడుదల

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీ పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్ 2025లో జరిగే ఎంఎడ్ 4వ సెమిస్టర్ రెగ్యూలర్, 1,2,3 బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు ఫీజు కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు పరీక్షల నియంత్రణాధికారి సంపత్ కుమార్ తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా 18 వరకు చెల్లించవచ్చునని, 100రూ. అపరాధ రుసుముతో ఆగస్టు 21వరకు చెల్లించుకోవచ్చునని తెలిపారు.

నిద్రావస్థలో జంతు జనన నియంత్రణ కేంద్రం

- కొన్ని నెలలుగా కుక్కలకు కు.ని. లేవు
- నగరంలో కుక్కల స్వైర విహారంతో భయాందోళనలో ప్రజలు
- ఏజెన్సీ నిర్వాహకులకు డిమాండ్ ఉండడంతో నిర్వహణలో ఇబ్బందులు
- 3 నెలల కోసం టెండర్ ప్రక్రియ పూర్తి



నగరంలో కుక్కలు



ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కుక్కల స్వైర విహారంతో బెంబేలెత్తుతున్న నగర ప్రజలకు కుక్కల బారి నుంచి కాపాడేందుకు నగర పాలక సంస్థ కొన్నేళ్ల క్రితం ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), (జంతు జనన నియంత్రణ కేంద్రం) సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఒక్క కుక్క కోసం రూ.1600 చొప్పున ఖర్చు చేస్తూ కుక్కలను నిలువరించేందుకు హైదరాబాద్ నుంచి ఏజెన్సీని పిలిపించి కు.ని ఆపరేషన్‌లు చేయించింది. కానీ ప్రస్తుతం ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ పట్టించుకోకపోవడంతో కొన్ని నెలలుగా నిద్రావస్థలోనే ఉంది. కుక్కల బెడద ఎక్కువవుతున్నా వాటిని కంట్రోల్ చేయడంలో నగర పాలక సంస్థ విఫలమవుతుంది. ఏబీసీ సెంటర్‌ను ఏర్పాటు చేసినా ఫలితం మాత్రం ఇవ్వడం లేదు. కుక్కల జననాలను అడ్డుకునేందుకు డాక్టర్ల సహాయంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. గతంలో ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. ఇవి కొన్ని నెలలుగా ఆగిపోయాయి. హైదరాబాద్ నుంచి ఏజెన్సీ నిర్వాహకులు నిజామాబాద్ రాకపోవడంతో కు.నీ ఆపరేషన్లు ఆగిపోయాయి. అధికారులు సైతం ఏజెన్సీ నిర్వాహకులను ఎప్పటికప్పుడు పిలిచినా వారు రాకపోవడంతో ఇబ్బందిగా మారుతుంది. ఏజెన్సీలకు డిమాండ్ ఉండడంతో ఇబ్బందిగా మారింది. ఒక్క కుక్కకు రూ.1600 కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు ఇచ్చినా ఏజెన్సీ నిర్వాహకులకు ఆసక్తి చూపడం లేదు. నగరంలో వేలాది కుక్కలు ఉన్నా డాక్టర్లు కేవలం రోజుకు 5నుంచి 6వరకే కు.ని. ఆపరేషన్లు చేసే అవకాశం ఉంది. నగరంలోనికి కుక్కలన్నింటికి ఆపరేషన్‌లు చేయాల్సి వస్తే ఎంత సమయం పడుతుందనేది ఇబ్బందిగా మారింది. రాష్ట్రంలో కేవలం మూడు ఏజెన్సీలు మాత్రమే ఉండడంతో వారికి డిమాండ్ ఎక్కువగా ఉంది.

నగరంలో కుక్కల బెడద

నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఒక్కో కాలనీలో వందల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. వేలాది కుక్కలు నగరంలో ఉండడంతో నగరవాసులకు ఇబ్బందిగా మారింది. గత కొద్దిరోజుల క్రితం నగరంలోని వివిధ ప్రాంతాల్లో కుక్కలు దాడి చేయడంతో పలువురు గాయాలపాలయ్యారు. నగరంలో ఏదో ఒక చోట ప్రతిరోజు కుక్కలదాడి సర్వసాధారనమైపోయింది. బయట తిరగాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు.ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధుల మీద కుక్కలు దాడి చేస్తున్నాయి. ఏ కుక్క ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఉదయం, సాయంత్రం పూట రోడ్లపై వాకింగ్ చేయాలంటే కుక్కల దాడులతో జంకుతున్నారు. ఇటీవల అర్సపల్లి, అజాంకాలనీ, నాగారం, వినాయక్‌నగర్, ఆర్యనగర్ తదితర ప్రాంతాల్లో పలువురిపై కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. వీటితోపాటు రాత్రుల్లో కుక్కలు గుంపులుగా తిరిగి వాహనాలపైకి, కాలినడక వెళ్లేవారిపై దాడులకు దిగుతున్నాయి. గాయాలైన బాధితులు ఆసుపత్రుల చుట్టు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలనీవాసులు కుక్కల స్వైర విహారంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఎలాంటి ఫలితాలు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల కట్టడికి రెండు టీంలు

నగరంలో కుక్కలను కట్టడి చేయడానికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కమిషనర్ దిలీప్ కుమార్ ప్రత్యేకంగా రెండు టీమ్‌లను ఏర్పాటు చేశారు. నగరంలో ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి కుక్కలను పట్టుకుని ఇతర ప్రాంతాల్లో వదిలివేయనున్నారు. 12మంది సిబ్బందితో కుక్కలను బందించే రెండు టీమ్‌లను ఏర్పాటు చేశారు. నగరంలో ఎవరైనా ఫిర్యాదు చేస్తే వీరు తక్షణమే అక్కడికి వెళ్లి కుక్కలను బందించనున్నారు. వీరితోపాటు ఏబీసీ నిర్వహణ కోసం ఆగస్టు, సెప్టెంబర్, నవంబరు నెలలకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తిచేయనున్నారు. ఏబీసీ సెంటర్ నిర్వహణ సక్రమంగా జరిగితే నగరంలో కుక్కలను నియంత్రించవచ్చు. కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేస్తే తప్ప వాటిని నియంత్రించే పరిస్థితి ఏర్పడడం లేదు.

ఏబీసీ సెంటర్ నిర్వహణ కోసం టెండర్లు పూర్తి

(దిలీప్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్)



మూడు నెలల ఏబీసీ సెంటర్ నిర్వహణ కోసం టెండర్‌లు పూర్తయ్యాయి. నగరంలో కుక్కల బెడదను నియంత్రించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. టెండర్లు కూడా పూర్తయ్యాయి. ఏజెన్సీ నిర్వాహకులు రాగానే కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తాం. కుక్కల బెడదను తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం.



ఆర్మూర్‌లోని జెండా మందిర్‌లో ప్రతిష్ఠించిన జెండా

నేడు ఆర్మూర్‌లో జెండా జాతర

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జెండాగల్లీలోని జెండా జాతరను నేడు నిర్వహిస్తున్నట్లు సర్వసమాజ్ ప్రజా ఐక్యసమితి అధ్యక్ష కార్యదర్శులు కొట్టాల సుమన్, కడ్తాన్ దినేష్‌లు తెలిపారు. గత వందేళ్ల నుంచి శ్రావణమాసంలో జెండా మందిరంలో జెండా జాతర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్రముఖులకు జాతరకు విచ్చేయాలని సర్వసమాజ్ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుండి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొంటారు. అప్పట్లో ప్రజలకు ఆర్థిక స్థోమత లేక తిరుపతిలోని వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లలేని వారు ఆర్మూర్‌లోని జెండా మందిరంలోని జెండాను దర్శించుకుని ముడుపులు చెల్లించి తొమ్మి ది రోజులు ప్రత్యేక పూజలు చేసిన తర్వాత జాతర నిర్వహించేవారు. అనంతరం ఆర్మూర్ శివారులో సర్వసమాజ్ సభ్యులు జెండాను అంకాపూర్ గ్రామస్థులకు అందజేస్తారు. అంకాపూర్ గ్రామంలో తొమ్మిది రోజుల పాటు పూజల అనంతరం జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామం లో పూజలందుకుని కంఠేశ్వర్ నీలకంఠ ఆలయంలో జెండాను ప్రతిష్ఠించి జాతర అనంతరం నేరుగా తిరుపతి దేవాలయానికి చేరుకుంటుంది.

సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజలు



సిద్దుల గుట్టపై పల్లకి సేవాలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలో పంచామృతాలతో, బిల్వా పత్రాలతో అభిషేకం నిర్వహించారు. రామాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు పల్లె గంగారెడ్డి కుటుంబ సభ్యులు శివాలయంలో, రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భక్తులు, ఆర్మూర్ భజన మండలి సభ్యులు నృత్యాలు చేస్తు భక్తి గీతాలు ఆలపించారు. గుట్టపైకి విచ్చేసిన భక్తులందరికి ఆర్మూర్ రాజస్థాన్ సంఘ సభ్యులు, ఆర్మూర్ పట్టణానికి చెందిన కొట్టాల మోహన్ కుటుంబ సభ్యులు అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, కొంతం మురళి, అలుశెట్టి నరేష్, సిద్దుల గుట్ట సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సీఎంసీ డిచ్‌పల్లి పాస్టరేట్ కమిటీ ఎన్నిక



డిచ్‌పల్లి సీఎంసీ పాస్టరేట్ కమిటీ ఎన్నికైన ప్రతినిధులు

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ మెడికల్ కళాశాల డిచ్‌పల్లి పాస్టరేట్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆరుగురు పోటీ పడగా ముగ్గురు కమిటీ సభ్యులుగా మెట్టు శాంసన్, దైవాశీర్వాదం, డానియల్ సురాన, ఎన్నికయ్యారు. అధికారులుగా మినిస్టీరియల్ సెక్ర టరి రెవరెండ్ జయనంద్ ,పెసిపిలేటర్ ఇన్‌చార్జి రెవరెండ్ ఏసుకుమార్, సహాయకులుగా దినాకర్, స్టీవెన్ కుమార్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా జయనంద్ మాట్లాడుతూ సీఎంసీ డిచ్‌పల్లి పాస్టరేట్ కమిటీకి ముగ్గురు ఎన్నికయ్యారని చెప్పారు. సీఎస్ఐ మెదక్ దయాసిస్ ద్వార మరో ఇద్దరు సభ్యులను నామినేటేడ్ ద్వారా ఎన్నుకుంటారని తెలిపారు. అనంతరం ఈ కమిటీ వారికి పదవులు నిర్ణయిస్తారని చెప్పారు. నూతన సభ్యులను ఘనంగా సత్కరించారు.

టీయూలో ప్రారంభమైన తీజ్ వేడుకలు



టీయూలో ఘనంగా ప్రారంభమైన తీజ్ వేడుకలు

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీలో సోమవారం తీజ్ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్ర పటానికి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ పండగలో బంజారాలు సంస్కృతి సంప్రదాయలతో 9 రోజుల పాటు నిర్వహిస్తారని కార్యక్రమానికి హాజరైన ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తీజ్ ఉత్సవాలు వర్సిటీలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా అధ్యాపకులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. శాంత బాయి. కిరణ్ రాథోడ్,ప్రవీణ్, బీకోజీ, మహవీర్, రవీందర్ నాయక్, సాగర్, శ్రీనురాథోడ్, రాము హరీష్ పాల్గొన్నారు.

పాప నాగమ్మ ఆలయానికి బోనాలతో గంగపుత్రుల పాదయాత్ర

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం రెండవ సోమవారం గంగపుత్రుల ఆనవాయితీ ప్రకారం బెల్లాల్ చెరువు కట్టపై ఉన్న పాపా నాగమ్మ తల్లికి ప్రతి సంవత్సరం బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు కోట అబ్బయ్య తెలిపారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి తెప్పోత్సవం కార్యక్రమంతో పాటు ఒడిబియ్యం నింపి మొక్కులు చెల్లించుకున్నామన్నారు. ప్రజలు బెల్లాల్ నీళ్ల తాగితే కీళ్ల నొప్పులు ఉండవని పేర్కొన్నారు. అమ్మవారి దయ వల్ల ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురియాలని, పాడిపంటలు సమృద్ధిగా కురువాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వన భోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, వెండి పోశెట్టి, కోట అబ్బయ్య, లింగం, తోకల పోశెట్టి, బొంతల గంగాధర్, వెండి నగేష్, దత్తు, దాల్‌మల్కు సాయిలు, వెండి గంగారాం, బాలయ్యలతో గంగపుత్ర మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గంగపుత్ర మహిళలు

విద్యార్థులు జాతీయ వాదం వైపు నడవాలి



ఏబీవీపీ సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకుడు శివ

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఏబీ వీపీ సభ్యత్వ నమోదును జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ పాల్గొని చేయించారు. విద్యార్థులంతా జాతీయ వాదం వైపు నడవాలని సూచించారు. దేశంలో ఏబీవీపీ అతి పెద్ద విద్యార్థి సంఘంగా ముందుకు సాగుతుందని ప్రతీ ఒక్కరు సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సమీర్, లెనిన్, అనిల్, నెహ్రూ రామకృష్ణ పాల్గొన్నారు

26 రోజులు పని దినాలు కల్పించాలని

శివాజీ బీడీ ఫ్యాక్టరీ ముట్టడి

- ధర్నా నిర్వహించిన కార్మికులు



డిచ్‌పల్లిలో శివాజీ బీడీ ఫ్యాక్టరీ ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్ యూనియన్ టీయూసీఐ ఆధ్వర్యంలో సోమవారం డిచ్‌పల్లిలోని శివాజీ బీడీ ఫ్యాక్టరీ కార్మికులు 26 రోజుల పాటు నెలలో పని కల్పించాలని డిమాండ్ చేస్తు బీడీ ఫ్యాక్టరీ ముందు పెద్ద సంఖ్యలో బీడీ కార్మికులు ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం శివాజీ ఫ్యాక్టరీ మేనేజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా బీడీ కార్మికులకు నెలలో వారం రోజులు మాత్రమే పని కల్పిస్తున్నరని కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నెలలో 26 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన తునక ఆకు ఇవ్వాలని పీఎఫ్ నెంబర్‌లు అందజేయాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమ పై జీఎస్టీ కక్ష కట్టిన్నట్లు విపరీతంగా ట్యాక్స్ పెంచడంతో కార్మికులు నష్టపోతున్నరన్నారు. వెంటనే ప్రభుత్వం జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2023 కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన్నట్లు 4వేల పించాన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రభుత్వం జీవన భృతి అందజేయకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కిషన్, మురళి, కమీషన్ దారులు నర్సయ్య, సాయినాథ్, సుదర్శన్, శ్రీధర్, గణేశ్, రఘు, ఆంజనేయులు కార్మికులు, జమున, లక్ష్మీ, సుజాత, నర్సవ్వ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత మగ్గం శిక్షణ

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి మగ్గం వర్క్ మహిళలకు కుట్టు మిషన్ ప్రారంభం అవుతాయని సంస్థ డైరెక్టర్ రవి కుమార్ తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి అందిస్తామని అభ్యర్థులు 19 నుంచి 45 వయస్సు కలిగి ఉండలన్నారు. ఆధార్, రేషన్, ఎస్సెస్సీ మెమో జిరాక్స్, ఫోటోలు 5 తీసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏదైనా సమాచారం కోసం ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 08461 295428 నంబర్ కు సంప్రదించాలని ఆయన కోరారు.



తరగతి గదికి తాళం వేసి ఉన్న దృశ్యం





తరగతి గదిలో ఉంచిన సామగ్రి

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. గదుల కొరతకు మూలం

- గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- సంవత్సరం కాలంగా తరగతి గదిలోనే నిర్మాణ సామగ్రి
- తరగతిని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న విద్యార్థులు

రుద్రూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో గత సంవత్సరం క్రితం అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ పాఠశాలలో అదనపు గదులట నిర్మాణాల పనులు చేపట్టారు. ఇంత వరకు బాగానే ఉన్నా తరగతి గది నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత నిర్మాణ పనులకు వినియోగించిన సామగ్రిని సంబంధిత కాంట్రాక్టర్ తిరిగి తీసుకెళ్ల లేదు. నిర్మాణ సామగ్రిని ఓ తరగతి గదిలో భద్రపర్చుకున్నారు. తరగతికి తాళం వేసి వెళ్లిపోయారు. సంవత్సరం అవుతున్న సదరు కాంట్రాక్టర్ ఇప్పటి వరకు సామగ్రిని తీసుకెళ్లలేదు. దీంతో తరగతుల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదిని అందుబాటులోకి తీసుకువస్తే పాఠశాల విద్యార్థులకు తరగతి గదులు పు ష్కలంగా ఉంటాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తరగతి గదిలో ఉంచిన సామగ్రిని తీసుకెళ్లాలని ఎన్నిసార్లు ఫోన్ చేసి చెప్పిన సదరు కాంట్రాక్టర్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారు.

● తరగతి గదిలోనే సామగ్రి

విద్యార్థులు చదువుకోవాల్సిన తరగతిని కాంట్రాక్టర్ తన నిర్మాణ సామగ్రితో నింపేశారు. గత సంవత్సరం కాలంగా తరగతి గదిలోనే సామగ్రి ఉండడం గమనార్హం. సామగ్రిని ఖాళీ చేస్తే తరగతి గదిని విద్యార్థులకు కేటాయించి విద్యాబుద్దులు చెప్పేందుకు అనుకూలంగా ఉంటుంది. అయినప్పటికీ సదరు గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ పాఠశాలకు చదువుకునేందుకు వస్తున్న విద్యార్థులు తరగతి గదుల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదిలో ఉన్న సామగ్రిని తొలగిస్తే విద్యార్థులకు కాస్త వెసులుబాటుగా ఉంటుంది. విద్యార్థుల చదువుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తరగతి గదిని గత సంవత్సరం కాలంగా కాంట్రాక్టర్ అక్రమించుకున్నారు.

● ఏడాది కాలంగా తాళం

రుద్రూరు ప్రభుత్వ బాలుర పాఠశాలలో గత ఏడాది కాలంగా ఓ తరగతికి తాళం వేసి ఉంది. పాఠశాలలో పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ పనులు ముగిసిపోయిన సామాగ్రిని మాత్రం తొలగించడం లేదు. పాఠశాలలో సంవత్సరం క్రితం పనులు పూర్తి చేశారు. తర్వాత తరగతి గదిలో సామగ్రి ఉంచి తాళం వేశారు. ఏడాది కాలం పూర్తయిన సదరు గుత్తేదారు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వర్షాకాలం సందర్భంగా విద్యార్థులకు తరగతి గదుల కొరత లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి తరగతిని ఖాళీ చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



హెచ్చరిక బోర్డు లేక ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు



మూల మలుపు వద్ద కంప చెట్లు

ఎర్గట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏర్గట్ల, బట్టాపూర్ తడపాకల్‌కి వెళ్లే దారిలో మూలమలుపుల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదకర మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. క్షతగ్రాతులు తమ సమస్యను ఎవరికి చెప్పుకునలేక ఆస్పత్రుల్లో చేరి ఆర్థికంగా నష్టపోతున్నారు. మూల మలుపు వద్ద రోడ్లకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో ప్రమాదాలు అనివార్యమవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. తాడ్లరాంపూర్ నుంచి తడపాకల్ వెళ్లే దారిలో రోడ్డు ఎత్తుగా ఉండటం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం ఉంది. మండల కేంద్రంలో మెట్‌పల్లి వెళ్ళే దారిలో రెండు చోట్ల ప్రమాదకర మలుపు కంప చెట్లు పెరిగి ప్రయాణీలకు ఇబ్బందిగా మారింది. అంతే కాకుండా మండల కేంద్రం నుంచి బట్టాపూర్ వెళ్లే దారిలో మూలమలుపులు, కంప చెట్లతో నిండిపోయాయి. అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద కంపచెట్లు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కంప చెట్లను తొలగించాలి..

ఇల్లెందుల నాగేంద్ర, తడపాకల్



రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి కంపచెట్లు తొలగించాలి.

CLASSIFIEDS

WANTED OT TECHNICIAN

WANTED OT TECHNICIAN, IP NURSING STAFF, COMPUTER OPERATOR, HOME TUITION TEACHER GRADE 5 CBSC SYLLABUS. CONTACT: 9494765660 AJZ

LOSS OF PASSPORT

MIRYALKAR KARANKUMAR S/O: KISHAN, R/O SIRNAPALLY, INDALWAI (M), NIZAMABAD (DIST.), T.G. HAVE LOST MY ORGINAL PASSPORT NO. (F6990261) WHILE TRAVELLING FROM SIRNAPALLY TO INDALWAI MANDAL ON BIKE IF FOUND PLZ CONTACT: 7893806599 AJZ

WANTED DISTRIBUTOR

★ డీలర్స్ కావలెను: ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ వారి EV స్కూటర్ల కొరకు జిల్లా & మండల స్థాయిలో డీలర్లు కావలెను. ఆకర్షణీయమైన ఆదాయం కలదు. ఫోన్: 7607812456 AJH- 35009

Classifieds మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
నిజామాబాద్: 99484 06282, కామారెడ్డి : 9985411453



ప్రజావాణిలో పాల్గొన్న మూడు శాఖల అధికారులు

అధికారులు రారు.. సమస్యలు పరిష్కరించరు!

• తూతూ మంత్రంగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమం

నసురుల్లాబాద్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాలలో ప్రతీ సోమవారం అన్నిశాఖల అధికారులతో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నసురుల్లాబాద్ మండలంలో మొక్కుబడిగా సాగుతోంది. స్థానిక తహసిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కేవలం మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రజలు మాత్రం అన్ని శాఖల అధికారులు వస్తారనే నమ్మకంతో తమ సమస్యలను పరిష్కరించుకుందామని వస్తున్న ప్రజలుకు నిరాశే మిగిలింది. అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి రాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు. ఉన్నతాధికారులైనా స్పందించి ప్రజావాణి కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా, ప్రజా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీలను శుభ్రం చేయించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

బాన్సువాడరూరల్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): హన్మాజీపేట్ గ్రామంలోని డ్రైనేజీల్లో పేరుకున్న చెత్తచెదారాన్ని అధికారులు శుభ్రం చేయించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'డ్రైనేజీలు ఇలా ఉంటే వ్యాధులు వ్యాపించవా?' అనే కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో డ్రైనేజీలు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడే ఆస్కారం ఉందని అనే విషయాన్ని వివరించింది. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు పారిశుధ్య సిబ్బందితో పారిశుధ్య చర్యలు చేపట్టారు.

తాడ్వాయిలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం

తాడ్వాయి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బూత్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ అనే నినాదంతో సోమవారం తాడ్వాయి మండల కేంద్రంలోని 5 బూత్‌లలో కరపత్రాలు, గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ తాడ్వాయి మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, రాష్ట్ర హార్టికల్చర్ కన్వీనర్ గంగారెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు వెంకట్‌రావు, మండల ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దత్తాత్రేయ, తాడ్వాయి బూత్ అధ్యక్షుడు రాజు, శ్రీకాంత్, నవీన్, శ్రీను, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో బూత్ సంపర్క్ అభియాన్ పోస్టర్లను బీజేపీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. ఆరు గ్యారెంటీలు అని చెప్పి 420 మోసాలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీకి ప్రజలు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మధుసూదన్, జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీకాంత్, జిల్లా నాయకులు హుస్సేన్, రాంసింగ్, కిష్టయ్య, బాబు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'షబ్బీర్‌అలీ సహకారంతోనే పేదలకు నూతన రేషన్‌కార్డుల మంజూరు'

దోమకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ సహకారంతోనే దోమకొండలో 352 నూతన రేషన్‌కార్డులు, 1,841 ఆడింగ్ చేసిన కార్డులు మంజూరయ్యాయని మాజీ జడ్పీటీసీ తిరుమలగౌడ్ అన్నారు. దోమకొండలో ఆయన సోమవారం మాట్లాడుతూ 11ఏళ్ల క్రితం అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రేషన్‌కార్డులు ఇచ్చారని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నూతన రేషన్‌కార్డులు మంజూరయ్యాయని అన్నారు. దోమకొండ మండలంలో దోమకొండలో 170, లింగుపల్లిలో 29, అంచనూర్‌లో 43, సంగమేశ్వర్ 48, చింతమాన్‌పల్లి 5, ముత్యంపేట్ 6, అంబర్‌పేట 39, సీతారాంపూర్ 12 మంజూరయ్యాయని, వీటిని మంజూరు చేయించినందుకు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, సీఎం రేవంత్‌రెడ్డి , జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, మాజీ విండో చైర్మన్ నర్సారెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలి



డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న డైనింగ్ హాల్, సరస్వతి మాతా విగ్రహ పనులను నాణ్యతతో చేపట్టాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సూచించారు. సోమవారం పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన పూర్తి సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు కొడుతున్న ప్రైవేటు వ్యక్తిని పట్టుకున్న గ్రామస్థులు

బాన్సువాడ రూరల్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మాజీపేట్‌లో సోమవారం విద్యుత్ బిల్లులు నమోదు చేయాల్సిన సిబ్బందికి బదులుగా వేరే వ్యక్తులు చేస్తున్నవారిని గ్రామస్థులు పట్టుకున్నారు. శ్యాం అనే వ్యక్తి పొంతన లేని సమాధానాలు చెప్పడంతో మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారి వల్లే విద్యుత్‌శాఖకు చెడ్డపేరు వస్తుందని సంబంధిత అధికారులు అనధికారికంగా పని చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై సంబంధిత విద్యుత్ అధికారి అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా లైన్‌ఇన్‌స్పెక్టర్ నర్సింలు 1వ తేదీ నుంచి సెలవులో ఉన్నాడని తెలిపారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కల్తీ కల్లు నిర్మూలనకు
ఈత మొక్కల పెంపకం అవసరం



మల్కాపల్లిలో మొక్కలు నాటుతున్న దృశ్యం



హసన్‌పల్లిలోని అటవీప్రాంతంలో మొక్కలు నాటుతూ..

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): కల్తీ కల్లుని నిర్మూలించాలంటే ఈత మొక్కల పెంపకం అవసరమని ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ అన్నారు. ఎల్లారెడ్డి మండల పరిధిలోని దవల్ మల్కాపల్లి గ్రామంలో సోమవారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను గ్రామస్థులు జాగ్రత్తగా కాపాడాలని కోరారు. ఈత మొక్కలు విరివిగా పెంచడం వలన స్వచ్ఛమైన సహజ సిద్ధమైన ఈత కల్లు లభిస్తుందని కల్తీ నిర్మూలనకు తోడ్పడుతుందన్నారు. మొక్కలు నాటడంతోనే మన వంతు బాధ్యత తీరిపోదని, అవి పెరిగి పెద్దవయ్యే వరకు వాటిని సంరక్షించినప్పుడే వాటిని నాటిన లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. గ్రామస్థులు ప్రతీఒక్కరు తమ వంతుగా చెట్లను పెంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో వినోద్, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఈత మొక్కలను పెంచాలి

మహమ్మద్‌నగర్: మండలంలోని హసన్‌పల్లి గ్రామంలో గల అటవీప్రాంతంలో బాన్సువాడ ఎక్సైజ్‌శాఖ, ఉపాధిహామీ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రావణ్ కుమార్, ఉపాధిహామీ టీఏ ప్రభాకర్, క్షేత్ర సహాయకుడు బాల్‌రాజు ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరు తప్పనిసరిగా ఆరు మొక్కలను నాటాలన్నారు. గౌడసంఘం ప్రతినిధులు విరివిగా ఈత మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కారక్రమంలో ఎక్సైజ్‌శాఖ, ఉపాధిహామీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు షూ పంపిణీ చెస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థి దశ అతిముఖ్యమైనది

• జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్

మద్నూర్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ బాధ్యతగా చదువుకొని దేశ ప్రయోజనాలను కాపాడాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్ అన్నారు. డోంగ్లీ మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. వ్యక్తిత్వ వికాసానికి వ్యక్తి పురోగతికి, సమాజం మరియు దేశ అభ్యున్నతికి విద్య ఎంతో తోడ్పడుతుందని వివరించారు. పాఠశాలకు సంబంధించిన ప్రహరీ, అదనపు తరగతులు నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్‌కార్డులను తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.



బోరు బావి తవ్వకం వద్ద పూజలు చేస్తున్న ఎంఈవో

'ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయడం అభినందనీయం'

పిట్లం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలను సేవ్‌ది గర్ల్ చైల్డ్ సంస్థ దత్తత తీసుకొని పాఠశాల బలోపేతానికి కృషి చేయడం అభినందనీయమని ఎంఈఓ దేవిసింగ్ అన్నారు. సోమవారం పాఠశాలలో నూతనంగా బోరు బావిని సేవ్‌ది గర్ల్ చైల్డ్ సంస్థ ఆధ్వర్యంలో తవ్వించినట్లు తెలిపారు. విద్యార్థినీలకు మౌలిక వసతులు, పూర్తిస్థాయిలో కల్పించడం జరుగుతుందన్నారు. పిట్లం గ్రామానికి చెందిన నవాబ్ శివకుమార్‌గౌడ్ చంచల్‌గూడ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆయన సేవ్‌ది గర్ల్ చైల్డ్ సంస్థ వారితో కలిసి పిట్లంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయడంపై విద్యార్థులుల తల్లితండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణరావ్, సుదర్శన్‌గౌడ్ ఉన్నారు.

బీవీఎం రాష్ట్ర కన్వీనర్‌కు సన్మానం

తాడ్వాయి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన రవితేజ బీవీఎం రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను బామ్‌సేఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్ సన్మానించారు. విద్యార్థి సమస్యలపై పోరాడుతూ విద్యార్థి లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నాడని కొనియాడారు. కార్యక్రమంలో బామ్‌సేఫ్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని
టీయూ సౌత్ క్యాంపస్‌లో ధర్నా



టీయూ సౌత్‌క్యాంపస్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థులు



రిజిస్ట్రార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఏదైనా జరిగినప్పుడే క్యాంపస్ అధికారులు హామీలు ఇచ్చి తర్వాత మరిచిపోతారని, సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు విన్నవించినా క్యాంపస్ అధికారులు పట్టించుకోవడం లేదని భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. క్యాంపస్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. పిన్సిపాల్ చాంబర్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. దీంతో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ ఆందోళన చేస్తున్న విద్యార్థులను సముదాయించే ప్రయత్నం చేశారు. సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థులు భీష్మించుకు కూర్చున్నారు. ఈ మేరకు విద్యార్థులు మాట్లాడుతూ సౌత్‌క్యాంపస్‌లో చాలా సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా అంబులెన్స్ లేకపోవడంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అంబులెన్స్ వైద్యసిబ్బంది ఉండి ఉంటే ఎంతో కొంత శిరీష బతికే అవకాశం ఉండేదని అన్నారు. క్యాంపస్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో అడవిపందులు సంచరిస్తున్నాయని అన్నారు. పాములతో సవాసం చేస్తున్నామని ఆరోపించారు. క్రీడప్రాంగణం లేక ఆటలు ఆడలేకపోతున్నామన్నారు. కనీసం జ్వరం వస్తే వేసుకుందామంటే ట్యాబ్లెట్‌లు ఉండటం లేదన్నారు. క్యాంపస్‌లో ఏదైనా సమస్య వచ్చినప్పుడే అధికారులు వచ్చి మాటిచ్చి వెళ్తున్నారని అనంతరం ఇటువైపు ఎవరు చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీసీ వచ్చి తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించమని అన్నారు. విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ యాదగిరి సౌత్‌క్యాంపస్‌కు చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వినతిపత్రం అందజేసి 6గంటలుగా చేసిన ఆందోళనను విరమించారు. విద్యార్థుల ఆందోళనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



యోగాపోటిలలో పాల్గొన్న చిన్నారులు,మహిళలు

యోగా పోటీలలో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

కామారెడ్డిటౌన్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని యోగభవన్‌లో సోమవారం జరిగిన అస్మిత కేలో ఇండియా యోగాసన సిటీ లీగ్ పోటీలలో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ పోటీలలో 18ఏళ్ల పైబడిన వారిలో కొండేరి శివాని గోల్డ్‌మెడల్, హేమవంతిని సిల్వర్ మెడల్, శ్రీహర్షిత బ్రాంజ్‌మెడల్‌లు సాధించారు. 18 ఏళ్ల లోపు ఉన్న వారిలో సీహెచ్ సహస్రగోల్డ్ మెడల్, సింధూజ సిల్వర్‌మెడల్, పిజనిహరిక బ్రాంచ్ మెడల్‌లు సాధించారు. కార్యక్రమానికి హాజరైన జీసీడీఓ సుకన్య బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్ అధికారి జగన్నాథం, నోడల్ అధికారి షేక్‌సలాం, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగారాంరెడ్డి, సెక్రటరీ రఘుకుమార్, బద్దం అనిల్, అంజయ్యగుప్తా, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కలవరం

(5వ పేజీ తరువాయి)

అక్కడి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినా రవీందర్‌రెడ్డి నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉంటూ క్యాడర్‌ను బలోపేతం చేశారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో కాసుల బాలరాజ్, పోచారం ఒక్కటవ్వగా ఏనుగు వర్గానికి ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గం అంతటా కాంగ్రెస్ శ్రేణులు రెండుగా చీలిపోయారు. ఏనుగు వర్గానికి నామినేట్ పదవులు రాకుండా పోచారం అడ్డుకుంటున్నారంటూ ఆరోపిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే పోచారంపై ఏనుగు వర్గీయులు గుర్రుగా ఉన్నారు. ఇటీవల ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క సమక్షంలో పోచారం, ఏనుగు వర్గీయులు బాహాబాహీకి దిగారు. గతంలో బీర్కూర్ మండలంలో ఎమ్మెల్యే పోచారం తీరుకు నిరసనగా ఏనుగు వర్గీయులు ధర్నాలు చేపట్టిన సంఘటనలు ఉన్నాయి.

డుమ్మా మాస్టర్లకు చెక్

(5వ పేజీ తరువాయి)

చీటీలు, ఇతర వ్యాపారాలు చేస్తూ అసలు పాఠశాల ముఖం చూడనివారు ఎందరో ఉన్నారు. ఇలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పరస్పరం సహకరించుకుంటూ విధులకు హాజరుకాకున్న మరుసటి రోజు రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలు చాలా ఉన్నాయి. ప్రస్తుతం ఫేస్ రికగ్నిషన్ తీసుకురావడంతో బీజీనెస్ టీచర్లలో కలవరం మొదలైంది. అయితే పూర్తి స్థాయిలో ఫేస్ రికగ్నిషన్ యాప్ రిజిస్ట్రేషన్ పూర్తిస్థాయిలో అవడానికి మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 68 శాతం మాత్రమే రిజిస్ట్రేషన్ అయిందని విద్యాశాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే పలుచోట్ల సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు వస్తున్నాయని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



ఆలయంలో క్యూలో భక్తులు

సిద్ధరామేశ్వర ఆలయంలో భక్తుల తాకిడి

• స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

భిక్కనూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో శ్రావణ రెండో సోమవారం సందర్భంగా భక్తుల తాకిడి నెలకొంది. ఉదయం నుండే జిల్లా నలుమూలల నుండే కాకుండా ఉమ్మడి మెదక్, హైదారాబాద్ నుండి భక్తులు పెద్దఎత్తున చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు స్వామివారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా తీరొక్క పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ నిర్వహించగా మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సోయా పంట పరిశీలన



సోయా పంటను పరిశీలిస్తున్న అధికారి

గాంధారి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలో సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి యాదగిరి సోయా పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా సోయాపంటలో నెలకొన్న పురుగు నివారణకు ఏ మందు పిచికారి చేయాలి, పంట అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వ్యవసాయశాఖ అధికారులు వివరించారు. పురుగు నివారణకు ఎకరాకు ఎనిమిది చొప్పున లింగార్షక బుట్టలు అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నికిత, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి నగదు పురస్కారం అందజేత

దోమకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దోమకొండ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 2024-25 సంవత్సరానికి సంబంధించి 10వ తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థినీ సన్నితకు విశ్రాంత ఉపాధ్యాయుడు ఎంఏ మోయిన్ తన సతీమణి ఖుర్షిద్ బేగం జ్ఞాపకార్థం సోమవారం రూ. 5వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శరత్‌కుమార్, రాజేంద్రప్రసాద్, పన్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

PUBLIC NOTICE

General public are hereby in formed that my client M/S Shriram Finance Ltd., Bodhan branch, agreed to accord loan to Borrower : Balgam Ashok S/o Lingappa Aged 30 Years Occ : Business R/o H.No. 2-61 Gopanpally Bichkunda Village & Mandal, Kamareddy Dist, Property holder Balgam Ashok S/o Lingappa Aged 30 Years, Occ : Business, R/o H.No. 2-61, Gopanpally, Bichkunda Village & Mandal, Kamareddy Dist, by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 5 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan

Schedule

The Open Place Sy.No. 217/అ& After Nala Convention Sy.No.217/అ2/1 Area of admeasuring 181.05 or Sq yards or (0.015Ac.Gts) Situated At Bichkunda Village & Mandal, Kamareddy Dist, Under the Jurisdiction of Registration Dist Nizamabad Sub Dist Bichkunda

Bounded as under:

East: Road, **West:** Others : Kaluva, **North:** Others : Land of Kuma Chandrakala, **South:** Others : Kaluva.

Sd/- K. SUBBA RAO, B.Sc.LLB
Advocate,Bodhan. Ph:9440004201



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - సార్ మేడమ్
ప్రియా 70 - హరిహర వీరమల్లు
ప్రియా 35 - మహావతర్ నరసింహ

బాన్సువాడ

మహేశ్వరి - కింగ్‌డమ్
వెంకటేశ్వర - మహావతార్ నరసింహా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

